
సాక్షి
కాకినాడ

సోమవారం । 3 । మార్చి । 2025



రూ.51,116 విరాళం

ఐక్కవోలు: స్థానిక శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో నిత్యాన్నదానానికి వర్రే రామాంజనేయులు, ప్రశాంతిలక్ష్మి దంపతులు (అమలాపురం) ఆదివారం రూ.51,116 విరాళం సమర్పించారు.



సాగుకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సాయంత్రం)	సహర్ మంగళవారం (ఉదయం)
రాజమండ్రి	6.18	4.59
కాకినాడ	6.18	4.58
అమలాపురం	6.18	4.58

న్యూస్‌రీల్

పడిపోతున్న ఏలేరు నీటి నిల్వలు



ఏలేరులో ప్రస్తుత నీటినిల్వలు

ఏలేశ్వరం: ఎగువ నుంచి ప్రవాహం తగ్గడం.. నానాటికీ ఎండలు పెరుగుతూండటంతో ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు క్రమేపీ పడిపోతున్నాయి. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా, ఆదివారం 80.32 మీటర్లుగా నమోదైంది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.82 టీఎంసీల మేర మాత్రమే నీటి నిల్వలున్నాయి. ఆయకట్టుకు 1,200, విశాఖకు 200, తిమ్మరాజు చెరువుకు 100 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

లోవలో భక్తుల సందడి



లోవ దేవస్థానంలో భక్తుల రద్దీ

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో ఆదివారం రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 15 వేల మంది క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్నట్లు ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,12,800, పూజా టికెట్లకు రూ.68 వేలు, కేశఖండనకు రూ.11,400, వాహన పూజలకు రూ.4,500, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.34,610, విరాళాలు రూ.72,972 కలిపి మొత్తం రూ.3,04,285 ఆదాయం సమకూరిందని వివరించారు.

నేడు హుండీల ఆదాయం లెక్కింపు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించనున్నారు. అన్నవరం దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని గత జనవరి 30వ తేదీన లెక్కించారు. తిరిగి 30 రోజుల అనంతరం లెక్కింపు చేపట్టనున్నారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకూ మాఘ మాసం కావడంతో సత్యదేవుని ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. వారు హుండీల్లో పెద్ద మొత్తంలో కానుకలు సమర్పించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో ఈసారి హుండీల ద్వారా సుమారు రూ.1.5 కోట్లు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. హుండీల ఆదాయం లెక్కింపును దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వి.సుబ్బారావు పర్యవేక్షించనున్నారు. లెక్కింపులో దేవస్థానం సిబ్బంది అందరూ పాల్గొనాలని ఈఓ ఆదేశించారు.

ఘనంగా సత్యదేవుని రథసేవ



రథంపై కొలువుదీరిన సత్యదేవుడు, అమ్మవార్లకు హారతులిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై ఆలయ ప్రాకారంలో ఆదివారం సత్యదేవుని రథసేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి రథంపై వేంచేయించారు. స్వామి, అమ్మవార్లకు పూజల అనంతరం పండితులు కొబ్బరి కాయ కొట్టి రథసేవను ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల ఘోష నడుమ మూడుసార్లు రథంపై ఆలయ ప్రాకారంలో సేవ నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పండితులు నీరాజనం ఇచ్చి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకుడు ప్రయాగ రాంబాబు, పరిచారకుడు ముత్య వేంకట్రావు తదితరులు పూజలు చేశారు. రత్నగిరిపై రామారాయ కళావేదిక మీద సూర్య నమస్కారాలు, సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ ఈ కార్యక్రమం జరిగింది. సత్యదేవుడు, అమ్మవారు సోమవారం ముత్యాల కవచాలు (ముత్తంగి సేవ) ధరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రేపు హాకీ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): సీనియర్ మెన్ విభాగంలో హాకీ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హాకీ సంఘం కార్యదర్శి నంబు శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రీడా మైదానంలో మంగళవారం ఉదయం 8 గంటలకు ఈ ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకూ గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో జరిగే అంతర్ జిల్లాల హాకీ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

ఎవరో విజేత!

- నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- ఏలూరులో నిర్వహణ
- మధ్యాహ్నానికి మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యే అవకాశం
- గెలుపునకు సరిపడా ఓట్లు రాకపోతే ఎలిమినేషన్ ప్రక్రియ మరూ
- ఆ తరువాతే రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు



ఏలూరులో కౌంటింగ్ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

కాకినాడ సిటీ: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విజేత ఎవరో సోమవారం తేలనుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఏలూరులో జరగనుంది. జిల్లాలో మొత్తం 70,540 మంది పట్టభద్ర ఓటర్లు ఉండగా గత గురువారం 98 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఎన్నికల్లో 47,150 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఈవీఎంలకు బదులు బ్యాలెట్ పేపర్లు వినియోగించడం, ఓట్ల లెక్కింపు ప్రక్రియ భిన్నంగా ఉండటంతో ఫలితం తేలడానికి ఎక్కువ సమయమే పట్టే అవకాశం ఉంది.

స్ట్రాంగ్ రూములు తెరచి..

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా సోమవారం ఉదయం 7 గంటలకు ఆయా అభ్యర్థులు లేదా వారి తరఫున వచ్చే కౌంటింగ్ ఏజెంట్లు, పరిశీలకుల సమక్షంలో బ్యాలెట్ పెట్టెలు భద్రపరచిన స్ట్రాంగ్ రూములు తెరుస్తారు. మొదటిగా 25 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన బాక్సులు తెరుస్తారు. వాటిలో ప్రతి 25 బ్యాలెట్ పేపర్లను ఒక కట్టగా కట్టి డ్రమ్ములో వేస్తారు. తర్వాత స్ట్రాంగ్ రూముల నుంచి మరో 25 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు తీసుకువస్తారు. ఇలా 200 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన బ్యాలెట్ బ్యాక్సులను ఎనిమిది విడతల్లో తెచ్చి, బ్యాలెట్ పేపర్లను కట్టలుగా కడతారు. ఈ ప్రక్రియ గంటలో పూర్తి చేస్తారు.

ఒక్కో టేబుల్‌పై వెయ్యి ఓట్లు

ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. దీని కోసం 28 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ప్రతి టేబుల్ వద్ద పోటీలో ఉన్న 35 మంది అభ్యర్థులకు కనిపించేలా ఏర్పాటు చేస్తారు. అభ్యర్థుల ఏజెంట్లకు బ్యాలెట్ పేపర్ చూపిస్తారు. మొదటి ప్రాధాన్య ఓటు పోలైన అభ్యర్థికి సంబంధించిన గడిలో ఆ బ్యాలెట్ పేపర్ వేస్తారు. చెల్లని ఓట్లను ఏజెంట్లందరికీ చూపించి పక్కన పెడతారు. ఇలా మొదటి రౌండ్ కౌంటింగ్ మధ్యాహ్నం 4 గంటల్లోగా పూర్తయ్యే అవకాశం ఉంది.

సగానికి పైగా ఓట్లు వస్తేనే..

సాధారణ ఎన్నికల్లో ప్రత్యర్థి కంటే ఎక్కువ ఓట్లు సాధించిన వారిని విజేతగా ప్రకటిస్తారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియోజకవర్గంలో పోలైన ఓట్లలో చెల్లుబాటు అయిన వాటిలో మొదటి ప్రాధాన్య ఓట్లు సగానికి పైగా సాధించిన వారినే విజేతగా ధ్రువీకరిస్తారు. లెక్కింపు ప్రక్రియ రౌండ్ల వారీగా ఎలిమినేషన్ పద్ధతిలో సాగుతుంది.

- మొదటి ప్రాధాన్యం గుర్తించకపోయినా ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులకు ఓటు వేసినా, సరైన ప్రాధాన్యం లేకపోయినా ఆ ఓట్లను చెల్లనివిగా పరిగణిస్తారు.
- చెల్లుబాటైన ఓట్లలో మొదటి ప్రాధాన్య ఓట్లను అభ్యర్థుల వారీగా లెక్కిస్తారు. వీటిని 25 బ్యాలెట్లకు ఒక కట్టగా కడతారు.
- ఉదాహరణకు జిల్లాలో 47,150 ఓట్లు పోలవగా 2,500 ఓట్లు చెల్లకుండా పోయాయని అనుకుంటే.. వాటిని తీసివేసి, మిగిలిన 44,650 ఓట్లలో సగానికి పైగా మొదటి ప్రాధాన్యం ఓట్లు సాధించిన అభ్యర్థి గెలుపొందినట్లు ప్రకటిస్తారు.
- ఏ అభ్యర్థికీ సగానికి పైగా మొదటి ప్రాధాన్య ఓట్లు రాకుంటే అధికారులు ఎలిమినేషన్ రౌండ్ చేపడతారు.
- పోటీ చేసిన అభ్యర్థుల్లో అతి తక్కువ ఓట్లు సాధించిన వారిని ముందుగా ఎలిమినేట్ చేస్తారు. ఒకవేళ ఇద్దరు అభ్యర్థులు సమానంగా ఓట్లు సాధించి, చివరి స్థానంలో ఉంటే ఎన్నికల అధికారి డ్రా తీస్తారు. డ్రాలో వచ్చిన అభ్యర్థి బ్యాలెట్ పేపర్‌లోని మొదటి ప్రాధాన్య ఓట్లను అలాగే ఉంచి, రెండో ప్రాధాన్య ఓట్లు ఏ అభ్యర్థికి వచ్చాయో వారికి కలుపుతారు.
- ఒక అభ్యర్థి ఎలిమినేషన్ తర్వాత కూడా ఫలితం తేలకపోతే మరో అభ్యర్థికి వచ్చిన రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తారు. ఇలా రౌండ్ల వారీగా ఒక్కో అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తారు.
- నిర్దేశించిన ఓట్లు సాధించలేకపోతే మూడో రౌండ్ ఎలిమినేషన్ చేపడతారు. మూడో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తూ కలుపుతారు. ఫలితం తేలే వరకూ ఎలిమినేషన్ ప్రక్రియను కొనసాగిస్తారు. ఈ క్రమంలో సగానికి పైగా నిర్దేశిత ఓట్లను ఎవరు సాధిస్తే వారు గెలిచినట్లు ప్రకటిస్తారు.
- ఒకవేళ 35 మందిలో 33 మంది ఎలిమినేట్ అయినప్పటికీ గెలుపు కోటా రాకపోతే చివరిలో ఉన్న ఇద్దరు అభ్యర్థుల్లో ఎవరికి తక్కువ ఓట్లు వచ్చాయో ఆ అభ్యర్థిని ఎలిమినేట్ చేసి, ఆయనకు వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్య ఓట్లను 35వ అభ్యర్థికి కలుపుతారు. అప్పటికి కోటా వస్తే సరి. కోటా రాకపోయినా ఎలిమినేట్ కాకుండా చివరి వరకూ ఉన్న అభ్యర్థినే విజేతగా ప్రకటిస్తారు.
- మొదటి ప్రాధాన్య ఓట్లతో ఏ అభ్యర్థికీ గెలుపు కోటా రాక.. ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టి రెండో ప్రాధాన్య ఓట్లు లెక్కిస్తే మాత్రం కౌంటింగ్ ప్రక్రియ మరింత ఆలస్యం అవుతుంది. అదే కనుక జరిగితే ఫలితం వెల్లడి కావడానికి మరుసటి రోజు వరకూ సమయం పట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- 28 టేబుళ్లు.. 17 రౌండ్లు
- 2,18,902 ఓట్ల లెక్కింపు

ఏలూరు (మెట్రో): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. ఏలూరులోని సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు సోమవారం ప్రారంభం కానుంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆధ్వర్యంలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని ఆరు జిల్లాల్లోని 456 పోలింగ్ కేంద్రాల్లో గత నెల 27న పోలింగ్ జరిగింది.

69.50 శాతం పోలింగ్

అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3,637, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 47,125, ఏలూరు జిల్లాలో 29,651, కాకినాడ జిల్లాలో 47,150, తూర్పు గోదావరి జిల్లాలో 42,446, పశ్చిమ గోదావరి జిల్లాలో 48,893 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 69.50 శాతం ఓటింగ్ నమోదు కాగా, బ్యాలెట్ బాక్సులను ఏలూరులోని స్ట్రాంగ్ రూములో భద్రపరిచారు. ఈ ఎన్నికల బరిలో 35 మంది నిలిచారు. టీడీపీ బలపర్చిన పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు మధ్య ప్రధాన పోటీ నెలకొందని భావిస్తున్నారు.

ఉదయం 7 గంటలకు..

కౌంటింగ్ కేంద్రానికి సిబ్బంది 6.30 గంటల లోపు చేరుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 7 గంటలకు ప్రారంభం కానుంది. మూడు షిఫ్టుల్లో 700 మంది సిబ్బంది ఓట్ల లెక్కింపులో పాల్గొంటారు. మొత్తం 28 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 17 రౌండ్లలో కౌంటింగ్ జరగనుంది. ప్రతి టేబుల్‌కు కౌంటింగ్ సిబ్బంది, సూపర్‌వైజర్, రోల్ ఇన్‌చార్జి, షిఫ్ట్ ఇన్‌చార్జి, మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వహిస్తారు.

సమగ్ర శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్ పేట): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. కౌంటింగ్ ఏర్పాట్లను ఆదివారం ఆమె పరిశీలించారు. కౌంటింగ్‌పై సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇచ్చామన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తి కావడానికి రెండు మూడు రోజుల సమయం పట్టవచ్చన్నారు. పూర్తి భద్రతా ఏర్పాట్ల మధ్య కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి డ్యూటీ పాసులు, ఏజెంట్లకు ఐడీ కార్డులు జారీ చేశామన్నారు. పాస్ లేనిదే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రంలోనికి సెల్‌ఫోన్లను నిషేధించామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద నిర్వహిస్తామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఈపీడీసీఎల్ ఎస్ఈ పి.సాల్మన్‌రాజును కలెక్టర్ ఆదేశించారు.

స్నాతకోత్సాహం.. మిన్నంటిన వేళ..



పట్టాలు పొందిన విద్యార్థులతో అతిథులు, గురువులు



స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న డాక్టర్ నరసింహం, డాక్టర్ విష్ణువర్ధన్

- 248 మందికి పట్టాల ప్రదానం
- ఘనంగా ఆర్ఎంసీ 62వ స్నాతకోత్సవం

కాకినాడ క్రైం: ఐదున్నరేళ్ల నిర్విరామ శ్రమ.. ఇకపై నువ్వు డాక్టర్‌వి అంటే మనసు కదిలిపోయిన భావోద్వేగాలు.. అందుకున్న పట్టాను తనివితీరా చూసుకుంటూ చెమ్మగిల్లిన కళ్లు.. పుత్రోత్సాహం పొంగిపొర్లి ఆనందబాష్పాలు కురిపిస్తున్న అమ్మానాన్నల మోములు.. వియ్ మిస్ యూ అంటూ దాచి పెట్టుకున్న గాంభీర్యం నడుమ చెప్పలేక చెబుతున్న టీచర్ల హావభావాలు.. ఇలా ఒకటా రెండా చెప్పుకోవడానికి చాలని, పంచుకోవడానికి పట్టని ఎన్నో వెలకట్టలేని భావోద్వేగాలు కాకినాడలోని ప్రతిష్టాత్మక రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) స్నాతకోత్సవంలో ఆవిష్కృతమయ్యాయి. కళాశాల యాజమాన్యం సహకారంతో 2019 బ్యాచ్‌కు చెందిన సుప్రీం స్టాల్‌వార్ట్స్ ఈ సంబరాన్ని మిన్నంటే ఉత్సాహంతో భళా అనిపించేలా నిర్వహించారు.

ఆర్ఎంసఅ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సవానికి 5 వేల మంది హాజరయ్యారు. మొత్తం 248 మంది విద్యార్థులు వైద్య పట్టాలు అందుకున్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్, రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ముఖ్య అతిథిగా, కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. వీరితో పాటు జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ శ్రీనివాసన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, విజయనగరం వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీ మాధవి, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ మాణిక్యాంబ, డాక్టర్ ఉమామహేశ్వరరావు, ప్రొఫెసర్ డాక్టర్ శైలజ, డాక్టర్ లక్ష్మీనారాయణ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నుంచి వైద్యులు చిట్ల కిరణ్, ఆనంద్, ఆదిత్య సత్య ప్రసన్న, ఆర్ఎంసీ ఏడీ శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి.

డాక్టర్‌కు ఏఐ ప్రత్యామ్నాయం కాదు

విద్యార్థులనుద్దేశించి డాక్టర్ నరసింహం మాట్లాడుతూ, వైద్య ప్రక్రియల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక పాత్ర పోషిస్తోందని, అయితే వైద్యుడికి మాత్రం ఇది ప్రత్యామ్నాయం కాదని అన్నారు. రోగి భావోద్వేగాలను అంచనా వేసే శక్తి ఏఐకి లేదని చెప్పారు. పట్టాలు పొందిన విద్యార్థులందరూ తమ తల్లిదండ్రుల కలలు నెరవేర్చారని అన్నారు. తాను రాష్ట్ర స్థాయి విధుల్లో కొనసాగుతూ ఎటువంటి ఆటంకాలూ లేకుండా ముందుకు సాగడానికి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ సమర్థంగా విధులు నిర్వహించడమే కారణమని అన్నారు. ఆయన హయాంలోనే 2019–25 బ్యాచ్ విద్యార్థులు అసామాన్య విజయాలు సాధించారన్నారు.

నేను రాయల్ రంగరాయన్‌ని..

ఆర్ఎంసీ చరిత్రలోనే కనీవినీ ఎరుగని కీర్తి ప్రతిష్టలు సాధించారు డాక్టర్ సాయి అనిరుధ్. 2019–25 బ్యాచ్‌కు చెందిన ఈయన తొమ్మిది అవార్డులు, 5 బంగారు పతకాలు సాధించి, స్నాతకోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మనం ట్రైన్డ్, టెస్టెడ్, రెడీ టు సర్వ్' అంటూ సహ విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. రాయల్ రంగరాయన్‌గా ఎంతో గర్వపడుతున్నానని అన్నారు. హౌస్ సర్జన్‌గా తొలిసారి కాన్పులా పెట్టిన సందర్భం, ఓ గర్భిణికి డెలివరీ చేసి, శిశువును బయటకు తీసినప్పుడు కలిగిన భావోద్వేగం, వెన్ను విరిగేలా శ్రమించినా సీపీఆర్ తర్వాత వ్యక్తి చనిపోతే కలిగిన బాధ వర్ణించలేనంటూ చెప్పిన సందర్భంలో సభాస్థలిలో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. ఐదున్నరేళ్ల చదువును సబ్జెక్టుల వారీగా వర్ణిస్తూ హాస్యాన్ని జోడిస్తూ చెప్పిన తీరు ఆకట్టుకుంది. పట్టా పొందడం అంటే పరుగు ఆపేయడం కాదని, మరింత వేగంగా పరిగెట్టడమేనని డాక్టర్ అనిరుధ్ అన్నారు.

పేరుకు ముందు డాక్టర్.. ఆ కిక్కే వేరు

పేరుకు ముందు డాక్టర్ అనే ప్రిఫిక్స్ చేరితే ఆ కిక్కే వేరని డాక్టర్ విష్ణువర్ధన్ అనడంతో విద్యార్థుల్లో ఒక్కసారిగా ఉత్సాహం వెల్లివిరిసింది. కళాశాలను అత్యంత క్రమశిక్షణతో నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. డాక్టర్ లావణ్యకుమారి మాట్లాడుతూ, వైద్య విద్యార్థులకు ఇదో కొత్త అధ్యాయమని అన్నారు. వృత్తి జీవితం, వ్యక్తిగత జీవితం, ఆరోగ్యం సమన్వయం చేసుకోగలిగితేనే పరిపూర్ణ మానవుడిగా ఎదగగలమని హితవు పలికారు. తల్లిదండ్రుల శ్రమను గుర్తించి జీవించాలని సూచించారు. డాక్టర్ దేవీ మాధవి మాట్లాడుతూ, వైద్యుడిగానే కాదు, రోల్‌మోడల్‌గానూ ఎదగాలంటూ ఆకాంక్షించారు. విద్యార్థులతో డాక్టర్ శైలజ, డాక్టర్ దేవీ మాధవి వైద్య ప్రమాణం చేయించారు. అనంతరం డాక్టర్ నరసింహాన్ని సత్కరించారు.



డాక్టర్ నరసింహం చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న డాక్టర్ సాయి అనిరుధ్

ఐదు నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

- ఐదు రోజులు విశేష వాహన సేవలు
- 6న వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



స్వామివారి ఆలయం

కొత్తపేట: ఆత్రేయపురంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకూ వైభవంగా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఆలయ శాశ్వత ధర్మకర్త, ఆలయ కమిటీ చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో వెంకట సత్యరాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ పర్యవేక్షణలో ఐదు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఐదో తేదీ తెల్లవారు జాము నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలలో ఆ రోజు నుంచి వివిధ వాహనాలపై శ్రీవారి ఊరేగింపులు కనువిందు చేయనున్నాయి. రాత్రి 7.30 గంటలకు శేష వాహనోత్సవం నిర్వహిస్తారు. ఆరో తేదీ ఉదయం 10.30 గంటలకు శ్రీవారి కళ్యాణోత్సవం, సాయంత్రం 6 గంటలకు హనుమద్ వాహనోత్సవం, 7న ఉదయం 108 బిందెలతో కలశాభిషేకం, మహిళలచే సామూహిక కుంకుమార్చన, సాయంత్రం 108 తామర పుష్పాలతో మహాలక్ష్మీహోమం, అనంతరం సింహ వాహనోత్సవం నిర్వహిస్తారు. 8న గరుడ వాహనోత్సవం, అనంతరం శంకు, చక్ర నామార్చన, సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ నిర్వహిస్తారు. 9 న మహా శాంతి హోమం, పూర్ణాహుతి, అనంతరం శ్రీచక్ర స్నానం, అన్న సమారాధన, పల్లకిసేవ, రాత్రి శ్రీపుష్పయాగోత్సవం నిర్వహించనున్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 - 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 - 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

తెగుళ్లతో ఖాళీఫ్లవర్

- సస్యరక్షణ చర్యలు అవశ్యం
- లేకుంటే దిగుబడులపై ప్రభావం



సీహెచ్ శ్రీనివాస్, ఉద్యాన శాఖ అధికారి, కొవ్వూరు

పెరవలి: కూరగాయల పంటలో కాలీఫ్లవర్ ఆదాయాన్ని ఇచ్చే పంట.. ఇప్పుడు ఈ పంట రైతుల గుండెల్లో మంట పెడుతోంది. తెగుళ్ల ముప్పేట దాడి చేయడంతో ఇబ్బందిగా మారుతోంది. ఈ నేపథ్యంలో సస్యరక్షణ చర్యలు అవశ్యమని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 2,795 హెక్టార్లలో కూరగాయల సాగు జరుగుతుండగా, ఇందులో కాలీఫ్లవర్ 425 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ పంట సాధారణంగా శీతల ప్రాంతంలో వేయాల్సి ఉండగా, ప్రస్తుతం వేసవి ప్రారంభం కావడంతో తెగుళ్ల ఉధృతి అధికంగా ఉంది. దీనికి వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కొవ్వూరు ఉద్యాన అధికారి సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ పంటపై ప్రస్తుతం ఆకుమచ్చ, పచ్చపురుగు, బట్టవింగ్, రైసీనెస్, కొరడా తెగుళ్ల ఎక్కువగా ఆశించాయి. ఈ తెగుళ్ల నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు.

బట్టవింగ్

ఈ తెగులు ఆశించిన తోటల్లో పూలు చిన్నవిగా వస్తాయి. నత్రజని తక్కువగా అందించటం వల్ల లేక ఆలస్యంగా నారు నాటటం వలన ఈ ప్రభావం కనిపిస్తుంది. దీనిని అరికట్టాలంటే 21 నుంచి 25 రోజుల వయసు కలిగిన నారును మాత్రమే నాటుకోవాలి. సరియైన సమయానికి తగు మోతాదులో నత్రజని ఎరువును అందించాలి. సరియైన సమయంలో నాటుకోవాలి.



ఖండవల్లిలో కాలీఫ్లవర్ తోట

ఆకుమచ్చ తెగులు

ఈ తెగులు ఆశించిన తోటల ఆకులపై గుండ్రని బూడిద రంగు మచ్చలు ఏర్పడి క్రమంగా పెద్దవిగా మారతాయి. ఈ తెగులు సాధారణంగా వాతవరణంలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు వ్యాప్తి చెందుతుంది.

నివారణ చర్యలు

ఈ తెగులు నివారణకు మాంకోజెబ్ మందును లీటరు నీటికి 2.5 గ్రాములు లేదా కాఫర్ ఆక్సీ క్లోరైడ్ లీటరు నీటికి 3 గ్రాములు చొప్పున కలిపి పైరుపై పిచికారీ చేస్తే నివారణ అవుతుంది. తెగులు అధికంగా ఉంటే 10 రోజుల వ్యవధిలో రెండు నుంచి 3 సార్లు పిచికారీ చేయాలి.

పాడి-పంట

రైసీనెస్

ఈ తెగులు వాతావరణంలో వేడి ప్రారంభమైనప్పుడు వ్యాప్తి చెందుతుంది. ఈ తెగులు ఆశిస్తే పువ్వు వదులై, విచ్చుకున్నట్లుగా అయ్యి పువ్వు గుడ్డుపై మాగు వస్తుంది. దీనివల్ల పువ్వు అంద విహీనంగా కనిపించి మార్కెట్టులో ధరపడిపోతుంది. దీని నివారణకు పువ్వులకు ఎండ ఎక్కువగా తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పువ్వు విచ్చుకున్న వెంటనే సరైన సమయంలో పువ్వులను కోయాలి.

బ్రౌనింగ్

ఈ తెగులు బోరాన్ లోపం వల్ల వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా క్షార నేలల్లో ఈ పంటలను వేసినప్పుడు తెగులు వ్యాప్తి అధికంగా ఉంటుంది. ఈ తెగులు ఆశించిన పువ్వులపై గోధుమరంగు మచ్చలు ఏర్పడతాయి. కాండం గుల్లగా మారి నీరు కారుతుంది. దీని నివారణకు ఆఖరి దుక్కిలో ఎకరాకు 8నుంచి 10 కిలోలు బోరాక్స్ వేయాలి. లీటరు నీటిలో 3 గ్రాములు బోరాక్స్ కలిపి పువ్వు గడ్డ ఏర్పడే దశలో పిచికారీ చేయాలి.

కొరడా

ఈ తెగులు మాలిబ్దినం ధాతు లోపం వల్ల సోకుతుంది. ఆకులు పసుపుగా మారి, అంచులు తెల్లబడతాయి. తెగులు తీవ్రత ఎక్కుగా ఉంటే ఆకు మధ్య మాత్రమే పొడవుగా పెరుగుతుంది. ఇలా పెరిగితే కొరడా తెగులు ఆశించినట్లు గుర్తించాలి. దీని నివారణకు నత్రజనిని సరైన మోతాదులో అందించాలి. ఎకరాకు 400 గ్రాములు సోడియం లేదా అమ్మోనియం మాలిబ్డేట్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

- కాలీఫ్లవర్ పువ్వు తెల్లగా ఉండాలంటే పువ్వు ఏర్పడిన దశలో పువ్వు చుట్టూ ఉన్న ఆకులను పువ్వుపై కప్పుతూ సూర్యరశ్మి సోకకుండా దారంతోకానీ రబ్బరు బ్యాండ్ కానీ వేయాలి. 4 నుంచి 5 రోజుల తరువాత పువ్వును కోయాలి.



రైసీనెస్ తెగులు సోకి విడిపోయిన పువ్వు



ఆకుమచ్చ తెగులు సోకిన ఆకులు



బట్టవింగ్ తెలుగు సోకి చిన్న పువ్వు వేసిన దృశ్యం



ఆకులను తినేసిన పచ్చపురుగు

కుళ్లు తెగులు

ఈ తెగులు సాధారణంగా నారుమడి నుంచి ప్రారంభమై నాటిన తోటలోనూ వ్యాప్తి చెందుతుంది. ఆకుల అంచుల నుంచి పసుపు రంగుకు మారి ఈనెలు నల్లబడి కాండం కుళ్లి పోతుంది. ఈ తెగులు అధికంగా ఉంటే పువ్వును కూడా ఆశిస్తుంది. అది కూడా కుళ్లి పోతుంది.

నివారణ చర్యలు

ఈ తెగులు ఆశించిన తోట పూర్తయిన తరువాత మళ్లీ ఇదే పంటను వేయకూడదు. పంట మార్పిడి తప్పని సరిగా చేయాలి. ఈ తెగులు ఆశించినట్లు గుర్తించిన వెంటనే కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి 3 గ్రాములు చొప్పున కలిపి మొక్క అంతా తడిసేలా పిచికారీ చేయాలి. ఇలా చేయటం వలన తెగులును కొంతవరకు నివారించవచ్చు.

హెచ్‌ఎం వేధింపులపై కేసు నమోదు

పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేసిన విద్యార్థినులు

కరప: మండలం గొర్రిపూడిలోని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంపై వేధింపుల కేసు నమోదైంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఘటనపై స్థానికులు, విద్యార్థినులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గొర్రిపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అడబాల కాశీవిశ్వేశ్వరరావు కొంతకాలంగా పదో తరగతి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, వేధిస్తున్నారు. విద్యాశాఖాధికారులు సైతం ఆయనపై వచ్చిన ఫిర్యాదులను పట్టించుకోకపోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి హెచ్‌ఎంపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక ఎస్‌ఐ టి.సునీత శనివారం ఆ పాఠశాలకు విచారణకు వెళ్లారు. అదే సమయంలో ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి పాఠశాల సందర్శనకు వెళ్లి తిరిగి వస్తుండగా ఎస్‌ఐ సునీత చూసి పలకరించగా చిన్న విచారణకు వచ్చామని చెప్పడంతో ఎంఈఓ వెళ్లి పోయారు. తరువాత ఎస్సై అక్కడి విద్యార్థినులను కలసి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ విషయమై డీవైఈఓ ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం పాఠశాలకు విచారణకు వస్తున్నట్టు తెలిసింది. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యుడిపై కఠినచర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉచితంగా వినికిడి పరీక్షలు

- నేడు కాకినాడలో నాలుగు కేంద్రాల్లో ఏర్పాటు

కాకినాడ క్రైం: ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా సోమవారం ఉచితంగా వినికిడి పరీక్షలు నిర్వహించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆడియోలజిస్ట్స్ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పేథాలజిస్ట్స్ అసోసియేషన్ (ఏపీఏఎస్ఎల్‌పిఏ), ఇండియన్ స్పీచ్, లాంగ్వేజ్ అండ్ హియరింగ్ అసోసియేషన్ (ఐఎస్‌హెచ్‌ఏ) ఆంధ్రప్రదేశ్ శాఖ జనరల్ సెక్రటరీ డాక్టర్ పెబ్బిలి గోపి వెంకటేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ పి.రేణుకాదేవి తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక లచ్చిరాజు వారి వీధిలో వాగ్దేవి స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్‌లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వినికిడి సమస్యను నిర్లక్ష్యం చేస్తే జీవితాలు దుర్భరం అవుతాయన్నారు. వినికిడి లోపం ఉన్న చిన్నపిల్లల్లో మాట్లాడే లోపం లేకపోయినా మాటలు రావని అన్నారు. వివిధ కారణాలు ఇందుకు దారి తీస్తాయని తెలిపారు. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా ఐఎస్‌హెచ్‌ఏ, ఏపీఏఎస్ఎల్‌పీఏల సంయుక్త ఆధ్వర్యంలో వినికిడి లోపంతో బాధపడుతున్న ఐదేళ్లలోపు పిల్లలకు ఓఏఈ, పెద్దలకు ప్యూర్ టోన్ ఆడియోమెట్రీ అనే పరీక్షలను ఉచితంగా నిర్వహించాలని నిర్ణయించనున్నట్లు తెలిపారు. సదస్సులు ఏర్పాటు చేసి వినికిడి ప్రాధాన్యం, అది లోపించడం వల్ల తలెత్తే సమస్యలు, వినికిడిని కాపాడుకోవడం, లోపం ఉన్నవారిలో గుర్తించడంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కాకినాడలో వాగ్దేవి స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ (లచ్చిరాజు వారి వీధి), శ్రావ్య స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ (సాలిపేట, శ్రావణి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో), హియర్ జాప్ (మెయిన్ రోడ్ అపోలో ఆసుపత్రి ఎదురుగా), మహి స్పీచ్(రమణయ్యపేట, అపోలో ఫార్మసీ పై అంతస్తు)లో ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సహాయం కోసం 99899 85385, 99121 11107 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఏఎస్ఎల్‌పీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి డాక్టర్ డి.సూర్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు డాక్టర్ వి.హరీష్, డాక్టర్ ఫీబి, డాక్టర్ వి.తేజ, డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రేణుకాదేవి

ఉమ్మడి జిల్లా ట్రెజరీ ఉద్యోగుల కార్యవర్గం

- అధ్యక్షుడిగా శ్రీనివాసరావు
- కార్యదర్శిగా భాస్కరరావు

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.రామ్‌మోహన్‌రావు వ్యవహరించగా, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా పి.కిరణ్ కుమార్(నెల్లూరు), రాష్ట్ర పరిశీలకుడిగా డి.రమణ రెడ్డి(నెల్లూరు) వ్యవహరించారు. ఎన్నికల అనంతరం పి. శ్రీనివాసరావు ప్యానెల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎ.రామ్మోహన్‌రావు ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా పి.శ్రీనివాసరావు, సహాధ్యక్షుడిగా వి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా ఎస్.ఈశ్వరి, వి.శ్రీనివాస్, వి.శశికుమార్, ఎం.విశ్వనాథం, కార్యదర్శిగా వై.భాస్కరావు ఎన్నికయ్యారు. అలాగే సంయుక్త కార్యదర్శులుగా నజీరా బేగం, బీవీవీ సత్యనారాయణ, ఆర్.జయకృష్ణ, కోశాధికారిగా వైఎస్ మూర్తి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎస్.శ్రీనివాస్, ఎ.పాపారావు, హైదర్ ఆలీపాషా, ఉదయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'జయలక్ష్మి' బాధితులకు న్యాయం చేయండి

కాకినాడ రూరల్: జయలక్ష్మి సొసైటీ బాధితులకు న్యాయం చేయాలని బాధితుల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. స్థానిక చల్లా కళ్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం జయలక్ష్మి ఎంఏఎం సొసైటీ లిమిటెడ్ డిపాజిటర్ల బాధితుల సంఘం సమావేశం నిర్వహించింది. సమావేశానికి అధ్యక్షుడు జి.బదరీనారాయణ అధ్యక్షత వహించారు. 2022లో సుమారు 560 కోట్ల రూపాయలు డిపాజిటర్ల సొమ్ముతో జయలక్ష్మి సొసైటీ గత పాలకవర్గం బోర్డు తిప్పేసిందని, ఇప్పటికీ న్యాయం జరగలేదని పలువురు బాధితులు పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన పలువురు బాధితులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బదరీనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం గంగిరెడ్డి త్రినాథరావు ఆధ్వర్యంలో ఉన్న పాలకవర్గానికి జవాబుదారీతనం లోపించిందన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, బాధితులకు సత్వర న్యాయం జరగడం లేదన్నారు. పలువురు వృద్ధాప్యంలో ఉండి ఇబ్బందులు పడుతున్నందున వారికోసం పోరాడాల్సింది పోయి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, దీనిపై తాము గత నెలలో అవిశ్వాస తీర్మానం చేశామన్నారు. ప్రస్తుతం ఉన్న బోర్డులను తొలగించి రహస్య ఓటింగ్ ద్వారా కొత్తగా బోర్డును ఏర్పాటు చేయాలని, అందులో ప్రభుత్వ ఉద్యోగి విధిగా ఉండాలని సభ్యులు సూచిస్తున్నారన్నారు. తాము బాధితుల పక్షాన పోరాడతామని, త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో పిల్లి గణేష్, రామారావు, వీఎస్‌వీ సుబ్బారావు, రఘు, భూషణ్, నాగేశ్వరరావు, ప్రభాకరరావు, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బదరీనారాయణ

కారు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

- లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఘటన
- క్షతగాత్రులు రాజమహేంద్రవరం వాసులు







గాయాలపాలైన ఊట్ల రామకృష్ణ, అరుణ, అనంతలక్ష్మి



గాయపడిన సామ్రాజ్యం



గుండేరు వద్ద ప్రమాదానికి గురైన కారు

దెందులూరు: వివాహానికి కారులో వెళ్లి తిరిగివస్తుండగా జరిగిన ప్రమాదంలో ఐదుగురు గాయాలపాలయ్యారు. ఏలూరు జిల్లా దెందులూరు మండలం సత్యనారాయణపురం గుండేరు వాగు వద్ద శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నివాసం ఉంటున్న ఊట్ల రామకృష్ణ కుటుంబ సభ్యులు ఐదుగురు కలసి తమ సొంత కారులో పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో వివాహానికి వెళ్లారు. వివాహానంతరం శనివారం రాత్రి తిరిగి రాజమహేంద్రవరానికి బయలుదేరారు. రాత్రి రెండు గంటల సమయంలో వీరు ఏలూరు జిల్లా దెందులూరు మండలం సత్యనారాయణపురం గుండేరు వాగు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వెళుతున్న లారీని దాటేందుకు ప్రయత్నించగా, కారు అదుపు తప్పి లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న ఊట్ల రామకృష్ణకు తలపై, ఆయన భార్య అరుణకు కాలిపై గాయాలయ్యాయి. ఈ ఘటనలో రామకృష్ణ నాన్నమ్మ అనంతలక్ష్మి, అరుణ అమ్మమ్మ సామ్రాజ్యం, వారి కుటుంబ సభ్యుడు ఇరుసుమల్లి మణికంఠ కూడా గాయాలపాలయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న దెందులూరు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్సులో ఆశ్రం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితులకు అక్కడే చికిత్స అందిస్తున్నారు. నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శివాజీ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి ప్రధాన పంట కాలువలో గోపవరం ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని ఆదివారం గుర్తించినట్లు ఎస్సై సీహెచ్ రాజేష్ తెలిపారు. మృతుని వయస్సు సుమారు 50 నుండి 55 మధ్యలో ఉంటుందని, మృతదేహం గుర్తుపట్టేందుకు వీలు లేకుండా కుళ్లిపోయిందని ఆయన వివరించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పరిసర ప్రాంత వాసులు ఎవరైనా అదృశ్యానికి గురైతే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో 15 మందికి గాయాలు



దాడిలో గాయపడిన జాన్

ఏలేశ్వరం: పట్టణంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో 15 మంది గాయపడ్డారు. పట్టణంలోని మందుల కాలనీ, పెద్దవీధి, నందివీధి, నెయ్యిలపేట తదితర ప్రాంతాల్లో పిల్లలపై సైతం దాడి చేసింది. దాడిలో పదేళ్ల వయసు ఉన్న కార్తికేయ, రెండేళ్ల జాన్ గాయపడ్డారు. వీరిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎట్టకేలకు స్థానికులు దానిని మట్టుబెట్టారు.

ఓపెన్‌కు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 63 కేంద్రాలు
- హాజరు కానున్న 16,072 మంది విద్యార్థులు
- 17 నుంచి పదో తరగతి పరీక్షలు

రాయవరం: ఈ నెల ఒకటో తేదీ నుంచి రెగ్యులర్ ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభంగా కాగా, ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా ఏటా నిర్వహించే ఇంటర్ పరీక్షలను సైతం సోమవారం నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉన్నత చదువు కోసం ఆశ పడినప్పటికీ అనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందులతో చదువు నిలిపివేసిన వారి కోసం ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా ఓపెన్ స్కూల్ విధానం ద్వారా అవకాశం కల్పిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారికి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు ఇప్పటికే హాల్ టిక్కెట్లను విడుదల చేశారు.

ఉత్తీర్ణులు కానివారు సైతం

ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు గతేడాది ఆగస్టులో విడుదల చేసిన నోటిఫికేషన్ మేరకు ఇంటర్ పరీక్షలకు 16,072 మంది దరఖాస్తు చేసుకున్నారు. గతంలో పరీక్షలు రాసి, ఉత్తీర్ణులు కానివారు కూడా ఇప్పుడు పరీక్షలు రాయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 63 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్‌టికెట్లు విద్యార్థులకు చేరాయి. ఈ పరీక్షలు ఈ నెల 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు.

పదో తరగతి పరీక్షలు ఇలా..

ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా నిర్వహించే పదో తరగతి పరీక్షలు ఈ నెల 17 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. రెగ్యులర్ విద్యార్థులతో పాటే ఓపెన్ విద్యార్థులకూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 74 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 5,947 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు



ఓపెన్ స్కూల్ విద్యార్థులు

పకడ్బందీగా చేపట్టాలి

ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. ఇప్పటికే సీఎస్, డీవోలకు ఓరియంటేషన్ నిర్వహించాం. ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా పరీక్షలు నిర్వహించాలని డీఈవోలకు ఆదేశాలిచ్చాం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

జిల్లాల వారీగా పరీక్షా కేంద్రాలు, విద్యార్థుల వివరాలు

జిల్లా	పది విద్యార్థులు	ఇంటర్ విద్యార్థులు
కోనసీమ	1,195	4,645
కాకినాడ	2,248	6,625
తూర్పు	2,504	4,802
మొత్తం	5,947	16,072

ఊపుమీదున్న బండి

పిఠాపురం: దూడై లొంగనిది దున్నై లొంగునా! దేశ దిమ్మరై తిరగదూ.. అందుకే దూడగా ఉన్నపుడే బండి లాగడంలో మెళకువలను నేర్చుకోవాలి. ఇదిగో ఈ చిన్న దూడను చూశారా.. పని నేర్చుకోమంటే మొండికేస్తోంది. ఆ బుల్లి రైతు ఈ చిన్న దూడకి ఓ దానికి తగ్గ బండి కట్టి తోలడం అతడు నేర్చుకుంటుంటే.. మొండికేస్తూ అటూ ఇటూ తిరిగేస్తోంది దూడ. దానిని అతడు అదుపులో పెడతాడో జగమొండిగా తయారవుతుందో.. కొత్తపల్లిలో కనపడిన ఈ సరదా సన్నివేశాన్ని సాక్షి తన కెమేరాలో బంధించింది.

